దంచికొట్టింది.. అప్రమత్తం చేసింది!


కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్‌లో వరదనీటితో నిండిపోయిన గల్లీ


కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్ కమాన్ వద్ద నిలిచిన వరదనీరు

- భారీ వర్షంతో ప్రధాన రోడ్లపై నిలిచిన వరదనీరు
- నీరు నిలవకుండా చర్యలు తీసుకున్న అధికారులు
- నాలాలు, చెరువులను పరిశీలించిన జోనల్ కమిషనర్
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

కూకట్‌పల్లి: మండు వేసవిలో కుతకుతలాడుతున్న జనానికి గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 3గంటల పాటు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఆగకుండా వర్షం పడుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ సిబ్బందితో కలిసి చెరువులు, నాలాలను పరిశీలించారు. బాలానగర్ క్రాస్ రోడ్డు సమీపంలోని దీన్‌దయాల్ నాలాను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాల బృందాలను కూడా అప్రమత్తంగా చేయాలని ఆదేశించారు. నాలాలు, చెరువుల పరిసరాలకు ఎవరూ వెళ్లొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీ రమేష్, ఈఈ సత్యనారాయణ, ఏఎంసీ శ్రీకాంతరెడ్డి, డీఈ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలవకుండా చూడాలి...

మూసాపేట డివిజన్ పరిధిలో కుండపోతగా వర్షం పడటంతో నాలా, నీటి ప్రవాహ ప్రాంతాలను గురువారం డీసీ రమేష్, అధికారులు, సిబ్బందితో పరిశీలించారు. నీటి ప్రవాహం కొనసాగుతున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిలిచి ఉండకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో?

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో కురిసిన భారీ వర్షానికి గురువారం ప్రధాన రహదారులు చిన్నపాటి చెరువులను తలపించాయి. ఈ కారణంగా రోడ్లపై ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో? తెలియని పరిస్థితి నెలకొంది. వాహనదారులు జంకుతూ ఆ రహదారుల గుండా వెళ్లారు. ముఖ్యంగా అంజయ్యనగర్ ప్రధాన రహదారి, ఓల్డ్‌బోయిన్‌పల్లి ప్రధాన రహదారిపైన వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. అంజయ్యనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది.


మూసాపేట డివిజన్ పరిధిలోని వర్షపు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డీసీ రమేష్, అధికారులు


బాలానగర్‌లోని దీన్‌దయాల్ నాలాను పరిశీలిస్తున్న జెడ్‌సీ అభిలాష



సమతానగర్‌లోని కాలనీలలో వరదనీటి ప్రవాహం



'మనూ'లో ఎంఏ అరబిక్‌లో ప్రవేశాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 ఆఖరు

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులో చేరడానికి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలని అరబిక్ విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ గురువారం తెలిపారు. హైదరాబాద్ క్యాంపస్‌లో 60సీట్లు అందుబాటులో ఉండగా లక్నో క్యాంపస్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. స్థానికేతర విద్యార్థులకు హాస్టల్ వసతి పరిమిత సామర్థ్యంతో ఉంటుందన్నారు .మరిన్ని వివరాలకు.. డాక్టర్ ముఫ్తీ మహ్మద్ షరాఫే ఆలమ్- 9705610569, డాక్టర్ ఆసిఫ్ లాయిక్-8801589585లో సంప్రదించాలని సూచించారు.

25 నుంచి ట్రిపుల్‌ఐటీ సమ్మర్ స్కూల్

- పీఎల్ఎఫ్, హైసియాతో కలిసి నిర్వహణ
- నాలుగు వారాలపాటు 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్'

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కొత్తగా ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రకటించింది. ప్రొడక్ట్ లీడర్స్ ఫోరమ్ (పీఎల్ఎఫ్) హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)తో కలిసి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు సంస్థలు కలిసి నాలుగు వారాల ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించాయి. ఇందుకోసం రిజిస్ట్రేషన్లు తెరిచి ఉంచారని మే 25 తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందులో ప్రోగ్రామ్ ప్రొడక్ట్ మేనేజర్లు, డెవలప్‌మెంట్ మేనేజర్లు, ఆర్కిటెక్టులు, ఔత్సాహిక ఉత్పత్తి మేనేజర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులను లక్ష్యంగా చేసుకొని ఏర్పాటు చేశారు.

వాహనాలు తీసుకెళ్లాలి.. లేదంటే వేలం

సైబరాబాద్ పోలీసు అధికారులు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ సందర్భాలలో పట్టుబడిన వాహనాలకు సంబంధించి యజమానులు తగిన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని లేదంటే ఆ వాహనాలను వేలం వేయనున్నట్టు సైబరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్స్‌లో 522 వాహనాలను చట్ట ప్రకారం వేలం వేయాలని నిర్ణయించారు. వాహనానికి సంబంధించిన యజమానులు ఎవరైనా అభ్యంతరం కలిగి ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు మాసాల వ్యవధిలో సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో తమ క్లెయిమ్ చేయాలి .వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎంటీఓ-2 ఎన్ వీరలింగం సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి. అంతేకాకుండా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో కూడా వివరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 21, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 18, బీన్స్ 85, క్యారెట్ 35, గోబిపువ్వు 18, దొండకాయ 33, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 32, కీరా 18, దోసకాయ 18, సొరకాయ11, పొట్లకాయ 18, కంద 70, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 7 నుంచి 8, చామగడ్డ 45, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు 65 నుంచి 75, మునగకాయలు 4 నుంచి 5, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

18న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం


కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవ ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అదే విధంగా వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ పేర్కొంది. విశ్వకల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ పవిత్ర యజ్ఞ మహోత్సవానికి డా. శ్రీకాంతేంద్రస్వామి పాల్గొంటారని తెలిపింది. సాయంత్రం 6గంటలకు సంప్రదాయ మంగళవాయిద్యాలతో స్వామి, అమ్మవార్లకు దివ్య రథోత్సవ ఊరేగింపు ఉంటుందని పేర్కొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది. ఆరాధన మహోత్సవం, ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు, లోహశిల్పి పిట్లంపల్లి రామలింగాచారి, కార్యదర్శి బండదు సాయనాచారి, కోశాధికారి సంకోజు రవిశంకర్‌చారి, గణేష్‌చారి గురువారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

ముగిసిన గ్లోబల్ డైవర్సిటీ...

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ ఉద్యోగుల ఉద్యోగం ,సామాజిక సేవ తదితర అంశాలపై నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీలో నిర్వహించిన ఇండియా గ్లోబల్ డైవర్సిటీ ఎక్స్‌పీరియన్స్ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో నెట్‌వర్కింగ్ అవకాశాలు, కమ్యూనిటీ సర్వీస్ వర్క్‌షాప్ తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రముఖ ఎన్‌జీఓ యంగిస్తాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో పట్టణ మురికివాడలలో నివసించే పాఠశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ కిట్స్ రూపొందించారు. ఈ కిట్‌లలో స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ బాక్సులు, స్నాక్ బాక్స్‌లు, నోట్ బుక్‌లు, న్యూట్రిషన్ బార్‌లు వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో మాజీ ఆర్మీ అధికారి, ప్రొఫెషనల్ మేజర్ వందనా శర్మ కీలకోపన్యాసం చేశారు. సింక్రోనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ సెహగల్ తదితరులు మాట్లాడారు.

నగరానికి సమాంతరంగా మేడ్చల్ అభివృద్ధి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలి
- జెడ్పీ సమావేశంలో చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్ జిల్లా సమాంతర అభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మరింత కృషి చేస్తే శరవేగంగా ముందుకెళ్తామన్నారు. మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందన్నారు. ఇదే తరహాలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రూ.33 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. వానాకాలం రైతు భరోసా సాయం కూడా త్వరలో రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. చీర్యాలలో గతంలో అనుమతి లేకుండా నిర్మించుకున్న పేదల ఇళ్లను 14 శాతం పెనాల్టీతో రెగ్యులరైజ్ చేసి, ఇంటి నంబర్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సత్వరమే జీతాలు చెల్లిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యంకొంటామన్నారు. ఘట్‌కేసర్ సదరన్ క్యాంపు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సభలో జెడ్పీటీసీ, ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమాధానం చెప్పించారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. విద్యార్థుల యూనిఫామ్‌లను మహిళా స్వయం సహాయక బృందాలతో కుట్టిస్తామని డీఆర్‌డీఏ సాంబశివరావు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ శాఖల నుంచి 11,192 అనుమతులు ఇప్పించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్ తెలిపారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమలకు 230 యూనిట్లకు అనుమతి ఇచ్చామన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 373 యూనిట్లకు అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో జెడ్పీ సభ్యులు బేస్త వెంకటేశం, హరివర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎల్లుబాయి, అనిత, మధుకర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'రెండు నెలలుగా జీతం రావడం లేదు'

- బస్తీ దవాఖానా ఉద్యోగులు
- జీతాలు ఇప్పించేలా చూడాలని కోదండరాంకు వినతి


కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బస్తీ దవాఖానాలలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు రావడం లేదని బస్తీ దవాఖానా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగళపాటి సుమన్ అన్నారు. ప్రధాన కార్యదర్శి అంజాద్ అలీఖాన్, కమిటీ సభ్యులతో కలిసి గురువారం టీజేఎస్ అధినేత కోదండరాంను కలిశారు. దవాఖానా సిబ్బందికి జీతాలు ఇప్పించేలా ప్రభుత్వంతో మాట్లాడాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు సుమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ ఉప్పలయ్య, కోశాధికారి శాంతమ్మ, స్వప్న ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ జోస్యభట్ల కల్పన ఫోన్ : 9603196925లో సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయులకు వేతనం అందజేత


ఉపాధ్యాయులకు వేతనం అందజేస్తున్న శ్రీరంగం ట్రస్ట్ కోచైర్మన్ ఇందుమతి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మీనా రాజకుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు, గదులు శుభ్రం చేసే వ్యక్తులకు వేతనాన్ని అందజేయాలని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగంను కోరారు. ఈ సందర్భంగా వారిని నియమించి ప్రతి నెల వారికి వేతనాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మే నెల వేతనాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యకరమంలో శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి చేతుల మీదుగా కార్యాలయంలో ఉపాధ్యాయులకు వేతనం అందజేశారు.

పోక్సో కేసులో యువకుడికి పదేళ్ల జైలు


నిందితుడు సతీష్‌కుమార్ రెడ్డి

గచ్చిబౌలి: పెళ్లిపేరుతో మాయమాటలు చెప్పి బాలికను నమ్మించి అఘాయిత్యానికి పాల్పడిన ఓ నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు వెలువరించింది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లికి చెందిన కట్ల సతీష్‌కుమార్‌రెడ్డి(23) డ్రైవర్‌గా పని చేస్తూ మల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. లట్టుపల్లికి చెందిన బాలిక(15)తోపాటు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం గౌలిదొడ్డికి వచ్చారు. ఈ క్రమంలో ఆ బాలికలో అతడు తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి, ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు జూలై 2017లో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్‌హెచ్ఓ గంగాధర్, ఏసీపీ చంద్రకాంత్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి పి.ఆంజనేయులు గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై గరం.. గరం..



- జెడ్పీ సమావేశంలో వాడీవేడి చర్చ
- ధాన్యం కొనుగోళ్లు.. పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించని తీరుపై సభ్యుల ఆగ్రహం
- జీపీల్లో పన్నుల వసూళ్లు.. ఇంటి నంబర్ల నిర్లక్ష్యంపై రగడ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పంచాయతీల్లో.. ముఖ్యంగా ఘట్‌కేసర్ మండలంలోని పలు జీపీల్లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు, కొత్త భవనాలు, ఇళ్లకు అసెస్‌మెంట్, ఇంటి నంబర్ల కేటాయింపుల్లో నిర్లక్ష్యం, పన్నుల వసూళ్లలో చేతివాటం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తదితర సమస్యలపై జెడ్పీ సభలో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజాసమస్యలపై సభ్యుల వాగ్వాదాలు, వాడీవేడి చర్చలతో జెడ్పీ సమావేశం గరం.. గరంగా ముగిసింది.

అనుమతి లేని..

సభలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి(బీజేపీ) మాట్లాడుతూ ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ, ప్రతాపసింగారంతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో అనుమతి లేకుండా వందల సంఖ్యలో భవనాలతో పాటు బహుళ అంతస్తులు వెలుస్తున్నా.. కార్యదర్శులతో సహా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, వివరాలతో కూడిన పత్రాలను సభలో జెడ్పీ చైర్మన్‌కు అందజేశారు. ఇదే పరిస్థితి మిగతా మండలాల్లో కొనసాగుతుందని ఆవేదన చెందారు. జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం మాట్లాడుతూ చీర్యాలలో పేదలు 60 గజాల్లోపు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేశారని, ఇప్పటికైనా వారికి న్యాయం జరిగేలా అదనపు పెనాల్టీతో క్రమబద్ధీకరించి, ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. కొత్త ఇళ్లు, భవనాలకు ఇంటి నంబర్లు ఇవ్వడంతో పాటు అసెస్‌మెంట్ చేయడంలో కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. చీర్యాలకు సమర్థత కలిగిన కార్యదర్శిని నియమించాలని సూచించారు. సభలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ 14 శాతం అదనపు పెనాల్టీతో పేదలకు ఇంటి నంబర్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంసీపల్లి జెడ్పీటీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ చేసి పేదలకు స్థలం, ఇళ్లు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు నష్టపోయిన పేదలకు వారి నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేక..

కార్మికులకు 5 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో గ్రామ పంచాయతీలోనే పారిశుద్ధ్య పనులు స్తంభించిపోతున్నాయని, ఈ పరిస్థితి అన్నీ జీపీల్లో ఉందని ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆవేదన చెందగా, పలువురు సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు వందశాతం వసూలు చేయడంతో పాటు అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకుంటే జీపీల్లో ఆదాయం పెరుగుతుందని, తద్వారా కార్మికులకు సకాలంలో జీతాలు అందించవచ్చని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై డీపీఓ వెంకయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు 91 శాతం పన్నులు వసూలు చేశామని, ఈ నెలాఖరులోపు మిగతా పన్నులు వసూలు చేస్తామన్నారు. సకాలంలో చెల్లించని వారికి పెనాల్టీ వేస్తామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై..

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. గన్నీ బ్యాగులు లేవని, వర్కర్స్ అందుబాటులో ఉండటం లేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఆదేశాలతో సివిల్ సప్లై జీఎం రాజేందర్ మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొంటున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి సంస్థ, సంక్షేమ శాఖలపై సభ్యులు చర్చించారు. ఇందులో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ సీఈఓ నీరజతో సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రచారం చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు


ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌నుతో కాంగ్రెస్ మహిళా నాయకులు

ఆల్విన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను గురువారం మహిళా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, పుట్టందేవి, సౌందర్య, అనురాధ, కృష్ణ వేణి, యోగేశ్వరి, నాగలక్ష్మి, నిర్మలమ్మ, అన్నపూర్ణ, శ్యామల, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.